క్లుప్తంగా

వీరప్రకాశరావుకు విశిష్ట పురస్కారం



గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో గుంటూరు నగరానికి చెందిన లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ నూతలపాటి వీరప్రకాశరావు విశిష్ట పురస్కారానికి ఎంపిక చేసింది. సమాజంలోని వివిధ రంగాల్లో విస్తృతమైన సేవలు అందించిన ప్రముఖులకు శనివారం రాజమహేంద్రవరంలోని రాజరాజ నరేంద్ర కళా వేదికపై పురస్కారాలతో సత్కరించనున్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ద్వారా విశేష సేవలు అందించడంతో పాటు వివిధ రంగాల్లో విస్తృత సేవలు అందించిన వీరప్రకాశరావు పురస్కారాన్ని అందుకోనున్నారు.

ఏపీ ఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ డైరీ ఆవిష్కరణ



పాత గుంటూరు: రాజాగారితోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శుక్రవారం ఏపీ ఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ నూతన డైరీని ఏపీసీపీడీసీఎల్ చైర్మన్ కె. సంతోష్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ బి.జయభారత్ రావు, ఏపీ ట్రాన్స్‌కో ఫైనాన్స్ డైరెక్టర్ టి. వీరభద్రారెడ్డి, జెన్‌కో హెచ్ఆర్ డైరెక్టర్ సయ్యద్ రఫీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శివకుమార్, ప్రధాన కార్యదర్శి ఎ.వి.కిరణ్, పి.దాసు బాబు, ఎం.వసంతరావు, ఎం.చంద్రశేఖర్, ఒ.సారధి పాల్గొన్నారు.

చెత్త సేకరణలో ఇబ్బందులు లేకుండా చూడండి



తెనాలిఅర్బన్: మున్సిపల్ కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ గుంటూరు రీజనల్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు ఆదేశించారు. పట్టణంలోని కొత్తపేట, మహబ్‌చౌక్, చెంచుపేట, బుర్రిపాలెం రోడ్డులోని రైతుబజార్‌లను శుక్రవారం ఆయన పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. చెత్త సేకరణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులు కూడా ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో వలే డోర్ టు డోర్ కలెక్షన్‌ను ఆటోల ద్వారా చేయాలని అందుకు అవసరమైన రోజు వారి కూలీలను నియమించుకోవాలన్నారు. ఆయన వెంట కమిషనర్ ఎం.జశ్వంతరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎ.రామచంద్రరావు, డి.శ్రీనివాసరావులు ఉన్నారు.

గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు కిట్స్ విద్యార్థి ఎంపిక



విద్యార్థి గోపీకృష్ణ

ప్రత్తిపాడు: దేశ రాజధాని ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆర్‌డీసీ 2024 ఎన్‌సీసీ పరేడ్ కి కిట్స్ కళాశాల విద్యార్థి ఎంపికయ్యాడు. స్థానిక కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న పి. గోపీకృష్ణ 25(ఏ) ఎన్‌సీసీ బెటాలియన్ గుంటూరు గ్రూపు తరఫున హైదరాబాద్ ఆర్మీ శిక్షణా శిబిరంలో శిక్షణ పొంది, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టర్ నిర్వహించిన పరీక్షల్లో ఎంపికయ్యారు. ఈ నెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొననున్నట్లు కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు తెలిపారు. కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శుక్రవారం గోపీకృష్ణను యాజమాన్యం అభినందించింది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పదిహేడు డైరెక్టరేట్ ల నుంచి పాల్గొనే వేడుకల్లో తమ కళాశాల విద్యార్థి ఎంపికవ్వడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె. హరిబాబు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు

తాడేపల్లిరూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు అందె రేవంత్ శుక్రవారం తెలియజేశారు. ఈ సందర్భంగా మంగళగిరి రోటరీ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈనెల 13వ తేదీ మంగళగిరి టిడ్కో గృహాల ప్రాంగణంలో పోటీలను నిర్వహిస్తున్నామని, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 6 కన్సలేషన్ బహుమతులు, అదే విధంగా పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతి అందజేస్తామని తెలిపారు. మంగళగిరి పరిసర గ్రామాలకు చెందిన మహిళలు ఈ పోటీలలో పాల్గొనవచ్చని, 7995256609 లేదా 9948211176 ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ముందస్తు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు మాత్రమే ఈ పోటీలకు అనుమతించబడతారని, స్పాట్ రిజిస్ట్రేషన్ ఉండదని వివరించారు.

కలెక్టర్ చొరవతో మంగళగిరి చేనేతకు పూర్వ వైభవం

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డిని సత్కరిస్తున్న విప్ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరి

గుంటూరు వెస్ట్: మంగళగిరి చేనేతకు జాతీయ స్థాయిలో అవార్డు రావడంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి కృషి ఎంతో ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి కొనియాడారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసిన అప్పిరెడ్డి, ఎంఎల్యే మద్దాళి గిరిధర్, వైఎస్సార్ సీపీ మంగళగిరి, గుంటూరు తూర్పు సమన్వయకర్తలు గంజి చిరంజీవి, నూరి ఫాతిమా సత్కరించారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేతుల మీదుగా ఓడీఓపీ(వన్ డిస్ట్రిక్ట్ ఒన్ ప్రొడక్ట్) కింద కలెక్టర్ అవార్డు అందుకోవడం జిల్లాకే గర్వకారణమన్నారు. అత్యంత నాణ్యత, మన్నికకే కాకుండా మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా మంగళగిరి చేనేత వస్త్రాలకు పేరుందన్నారు. అందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతన్నల సంక్షేమం కోసం పెద్ద పీత వేశారని వివరించారు. జిల్లా కలెక్టర్ చొరవతోనే ఈ వస్త్రాలను రైల్వే స్టేషన్స్‌లోనూ, కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమ ఆవరణలోనూ అందుబాటులో ఉంచుతున్నారని పేర్కొన్నారు. దీంతో పాటు చక్కని మార్కెటింగ్ కల్పించేందుకు కలెక్టర్ కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.


10న జాతీయ యువజన దినోత్సవంపై పోటీలు



బ్రోచర్ విడుదల చేస్తున్న ఎస్వీ రమణ

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల స్థాయి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ తెలిపారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో శుక్రవారం పోటీలకు సంబంధించిన బ్రోచర్ శుక్రవారం విడుదల చేశారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఈనెల 10వ తేదీ పురస్కరించుకుని పోటీలు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎస్వీ రమణ మాట్లాడుతూ డిప్లొమా, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ చదువుతున్న విద్యార్థులకు 'నేటి యువతపై స్వామి వివేకానందుని ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన, మధ్యాహ్నం 2.00 గంటల నుంచి దేశ పురోగతిలో యువత పాత్ర అనే అంశంపై వక్తృత్వ పోటీ ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో సీహెచ్ సుబ్బారావు, కళాశాల ఎంబీఏ విభాగాధిపతి వి.చక్రవర్తి, ప్రొఫెసర్ డాక్టర్ కె. లలిత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సీహెచ్ వైష్ణవి, ఏ బాజీబాబు, వి.అభిలాష్, ఎన్. మణికంఠ, అనిత పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా తోట శ్రీనివాసరావు



గుంటూరు మెడికల్: బీజేపీ జిల్లా కార్యదర్శిగా గుంటూరుకు చెందిన తోట శ్రీనివాసరావును నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ శుక్రవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తోట శ్రీనివాసరావు మాట్లాడుతూ 2001 నుండి 2017 వరకు 17 సంవత్సరాలు భారతీయ వాయుసేనలో పనిచేసినట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీపై అభిమానంతో బీజేపీపై ఇష్టంతో, సైన్యం నుంచి వచ్చిన వెంటనే 2017లో కార్యకర్తగా చేరినట్లు వెల్లడించారు. 2019లో జిల్లా ఎక్స్ సర్వీస్‌మెన్ సెల్ కన్వీనర్‌గా పనిచేశానన్నారు.

కొనసాగుతున్న విజయ సంకల్ప యాత్ర

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పశ్చిమ నియోజకవర్గం కన్వీనర్ వల్లూరు జయప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీజేపీ విజయసంకల్ప యాత్ర శుక్రవారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. స్థానిక భారత్‌పేటలో ప్రారంభమై పోస్టల్ కాలనీ రత్నగిరి కాలనీ వరకు యాత్ర కొనసాగింది. బీజేపీ సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి ఏం చేసింది, ఏం చేయబోతున్నదనే విషయాలను ప్రజలకు వివరించేందుకు విజయ సంకల్ప యాత్ర చేపట్టామన్నారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ వల్లూరు జయప్రకాష్ నారాయణ, పి.సుధాకర్, పి.కృష్ణ చైతన్య, ఎం.సుగుణ, రమాదేవి, బి.రామకృష్ణ, వి.గంగాధర్ పాల్గొన్నారు.

ఘనంగా పెద్దేటమ్మ తల్లి పీఠం వార్షికోత్సవం



పెద్దేటమ్మ తల్లి పీఠం ఉత్సవాల్లో అంబటి మురళీకృష్ణ

కొరిటిపాడు(గుంటూరు): గత ఏడాది పొన్నూరు మండలం, మామిళ్లపల్లి గ్రామంలో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్మించిన పెద్దేటమ్మ తల్లి పీఠం మొదటి వార్షికోత్సం ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు. మూడు రోజుల వార్షికోత్సవాల్లో శుక్రవారం అంబటి మురళీకృష్ణ పాల్గొని, యజ్ఞం నిర్వహించారు. ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం ఘనంగా జరిగింది. శనివారం అన్న ప్రసాద వితరణ చేయడానికి గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు. ఇటీవల సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి అధికారంలోకి రావాలని 'రాజశ్యామల' యాగం ఇదే గ్రామంలో పెద్దేటమ్మ తల్లి పీఠానికి సమీపంలో నిర్వహించడం, యాగం విజయవంతం కావడం అందరికీ తెలిసిన విషయమే.

రేపు బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమం

కొరిటిపాడు(గుంటూరు): సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో బజరంగ్ ఫౌండేషన్ సామాజిక సేవా పరంపరను కొనసాగిస్తోందని, అందులో భాగంగా ఆదివారం పొన్నూరు మండలంలోని బ్రాహ్మణ కోడూరు, జూపూడి గ్రామాల్లో బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమం శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో బజరంగ్ – నేత్రజ్యోతి, బజరంగ్ – మీ గుండె పదిలం, బజరంగ్ – దివ్యాంగ దర్శిని, ఫిజియో థెరపీ సేవలు ఉచితంగా అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. నేత్రజ్యోతి ద్వారా కళ్లజోళ్లు, మీ గుండె పదిలం ద్వారా గుండె సర్జరీలు, స్టెంట్లు వేయించడం జరుగుతుందని తెలిపారు. దివ్యాంగులకు ఉచితంగా త్రి చక్ర వాహనాలు, జైపూర్ కాలు, వెస్టన్ కమోడు సమకూర్చడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

మలినేనిలో డిజైన్ థింకింగ్‌పై వర్క్‌షాప్



అవగాహన కల్పిస్తున్న కంపెనీల ప్రతినిధులు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం డిజైన్ థింకింగ్‌పై వర్క్ షాప్ నిర్వహించారు. ఐడియా ల్యాబ్స్ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్‌పై ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జరిగిన వర్క్ షాప్‌కు ముఖ్య అతిథులుగా ఐడియా ల్యాబ్స్ సీఈఓ పంకజ్ దివాన్, డిజైన్ థింకింగ్ ఎవాంజలిస్ట్ ఆర్. శ్రీకాంత్ హాజరయ్యారు. డిజైన్ థింకింగ్, మైండ్ మ్యాపింగ్ టెక్నిక్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మలినేని కళాశాలల చైర్మన్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ విద్యార్థులు నూతన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవాటు చేసుకుని అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె. అప్పారావు, డీన్ రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు భవిష్యత్ మీద ఆశ కలిగించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐఏఎన్ఎల్‌పీ ప్రెసిడెంట్ విశేష్

చేబ్రోలు: విద్యార్థులకు సమస్యలు ఎదురైనప్పుడు వారికి భవిష్యత్ మీద ఆశ కలిగించాలని ఐఏఎన్ఎల్‌పీ (ఇంటర్నేషనల్ న్యూరో లింగ్విస్టిక్ ప్రోగ్రాం) ప్రెసిడెంట్ విశేష్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఎంపవరింగ్ త్రూ ప్రివెన్షన్ – ప్రొఫెషనల్ ట్రైనింగ్ ఆన్ లైఫ్–సేవింగ్ ఎడ్యుకేషన్ అనే అంశంపై మూడు రోజుల పాటు అధ్యాపకులకు, కౌన్సిలర్‌లకు వర్క్‌షాప్ శుక్రవారం ప్రారంభమైంది. ఐఏఎన్ఎల్‌పీ ప్రెసిడెంట్ విశేష్ మాట్లాడుతూ అధ్యాపకులుగా ఎల్లప్పుడూ విద్యార్థులను సరికొత్తగా ఆలోచించే విధంగా ప్రోత్సహించాలన్నారు. తరగతిగదిలో ఉపాధ్యాయుడు లీడర్‌గా మారి తన ఫిలాసఫీని, తన ఆదర్శాలను విద్యార్థుల ముందుంచి వారిని గొప్ప ఆవిష్కర్తలుగా తయారుచేయాలని సూచించారు. జీవీఏ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైకాలజీ ఫౌండర్, క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ శ్రీకాంత్ గోగి మాట్లాడుతూ అధ్యాపకులు విద్యార్థుల సమస్యలను గుర్తించడంతో పాటు వారి భావోద్వేగాలను అర్థం చేసుకుని సునిశితంగా పరిష్కరించాలన్నారు. జీవితంలో ప్రతి విద్యార్థి కూడా కఠినమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. విద్యార్థులు ధైర్యంతో ముందుకు సాగితే జీవితంలో ఏదైనా సాధించగలరని నమ్మకాన్ని వారిలో కలిగించాలన్నారు. విద్యార్థుల ఎదుగదలలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఏపీఏఐ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ క్రిష్ణ భరత్, జి.రాజేశ్వరరావు, రవిభార్గవ్, ఎంపీ జానకిరామ్, పీవీవీ ప్రసాద్ అత్తోట తేజ, వైస్ చాన్సలర్ పీ.నాగభూషణ్ పాల్గొన్నారు.

గంజాయి తాగుతున్న యువకుల అరెస్ట్

పెదకాకాని: గంజాయి తాగుతున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని, అరెస్టు చేసినట్లు పెదకాకాని పోలీసులు తెలిపారు. మండలంలోని నంబూరు అలీరఫత్ నగర్ డొంకలో ఈ నెల గురువారం గస్తీ తిరుగుతున్న రక్షక్ వాహనం చూసి ముగ్గురు యువకులు పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. వారిని విచారించగా గంజాయి తాగుతున్న సమయంలో పోలీసు వాహనం చూసి పారిపోతున్నట్లు గుర్తించారు. వారి నుంచి 120 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నంబూరు గ్రామానికి చెందిన వేమూరి షారోన్, వట్లూరి తిరుమల, గుంటూరుకు చెందిన కుర్రా వంశీలుగా వారిని గుర్తించారు. విచారణలో నిందితులు వల్లూరి బాపయ్య వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపారు. నిందితులను శుక్రవారం అరెస్టు చేసి, కోర్టుకు హాజరు పరచినట్లు ఎస్ఐ వినోద్ తెలిపారు.

రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండాలి



చేబ్రోలు: వాహనదారులు రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండాలని తెనాలి ఆర్టీఓ కె.ప్రసాద్ అన్నారు. చేబ్రోలు మండలం నారాకోడూరులోని సెయింట్ మేరీస్ కళాశాలలో శుక్రవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని సూచించారు. ప్రమాదం జరగకముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రైనీ ఆర్టీఓలు మనోహర్, భరత్ చవాన్ మాట్లాడుతూ వాహనదారులు, పాదచారులు రహదారి నియమనిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. అతివేగం ప్రమాదకరమని, వాహనాలు నడుపుతూ సెల్ ఫోన్ మాట్లాడకూడదన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని వివరించారు. ఏఎంవీఐ మధుసూదన్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, గోల్డెన్ అవర్ ప్రాముఖ్యత వివరించారు. ఎంవీఐ రాఘవరావు రహదారి భద్రత వీడియోలను ప్రదర్శించి, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.హిమబిందు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిపోను అగ్రగామిగా నిలపండి

ఆర్టీసీ గుంటూరు ఆర్ఎం రవికాంత్



ఉద్యోగులతో మాట్లాడుతున్న రవికాంత్

తెనాలిఅర్బన్: అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తూ తెనాలి డిపోను రీజనల్ పరిధిలోనే ప్రథమస్థానంలో నిలపాలని ఆర్టీసీ గుంటూరు రీజనల్ మేనేజర్ ఎం.రవికాంత్ సూచించారు. తెనాలి డిపోన్ శుక్రవారం ఆయన పరిశీలించారు. గ్యారేజిలో ఉద్యోగులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సుల నాణ్యతా ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉద్యోగులు కూడా మంచి నైపుణ్యాన్ని కలిగి ఉండాలన్నారు. బస్సులు బ్రేక్ డౌన్ కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణికుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వారికి మంచి సేవలు అందించాలన్నారు. సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలని సాధ్యమైనంత వరకు వాటిని పరిష్కరించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో మేనేజర్ ఎ.రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ ఐజీ ప్రసాదరావు, అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్ఏ నాయక్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని పరిశీలించిన హెల్త్ సెక్రటరీ



దుగ్గిరాల(తాడేపల్లిరూరల్): దుగ్గిరాల గ్రామ పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాన్ని హెల్త్ సెక్రటరీ డాక్టర్ మంజుల శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతి సచివాలయ పరిధిలో విడతల వారీగా జగనన్న ఆరోగ్య సురక్ష – 2 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, మొదటి కార్యక్రమంలో వైద్యపరీక్షలు చేయించుకున్న వారి ఆరోగ్య పరిస్థితి ఏవిధంగా ఉందన్న విషయాలను ప్రతి హెల్త్ సెంటర్ ద్వారా తెలుసుకుంటున్నామని, రెండవ విడతలో కూడా వైద్య సేవలు పొందేందుకు ఎంతోమంది వస్తున్నారని, జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలందరికీ ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తున్నామని ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చిన తరువాత కూడా వైద్యులు వారి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి ఏ విధంగా ఉందో కూడా తెలుసుకుంటున్నారని ఆమె చెప్పారు.

గత ప్రభుత్వాలు అభివృద్ధిని గాలికొదిలేశాయి

వైఎస్సార్ సీపీ తూర్పు సమన్వయకర్త నూరిఫాతిమా



లబ్ధిదారులకు పింఛన్‌ను అందజేస్తున్న నూరి ఫాతిమా

నెహ్రూనగర్: తూర్పు నియోజకవర్గ అభివృద్ధిని గత ప్రభుత్వాలు గాలికొదిలేశాయని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని 57వ డివిజన్ మద్దిరాల కాలనీలో రూ.14 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సిమెంట్ రోడ్లకు స్థానిక కార్పొరేటర్ పఠాన్ రిహానతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో యూజీడీ పేరుతో రోడ్లన్నీ గుంతల మాయంగా మార్చేశారని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పనులు పూర్తి చేయించడంతో పాటు నూతనంగా సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మర్రి అంజలి, వైఎస్సార్ సీపీ నాయకులు నూర్‌ఖాన్, ఉషా, అమరనాథ్, నాగూల్‌మీరా, మర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

అవ్వాతాతలకు పింఛన్లు..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవ్వాతాతలకు ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ.3 వేలకు పెంచి వారి మోముల్లో చిరునవ్వులు విరజిల్లాజేశారని తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరిఫాతిమా పేర్కొన్నారు. వైఎస్సార్ పింఛన్ కానుక కింది పెరిగిన పింఛన్ నగదును లబ్ధిదారులకు 2వ వార్డు ఇస్రాయేల్‌పేటలోని బోర్రా నాగేశ్వరరావు స్కూల్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు మించి పేద ప్రజల లబ్ధి కోసం పథకాలను అమలు చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తురన్నారు. ఈ పథకాలు మరలా కొనసాగాలంటే తిరిగి వైఎస్ జగన్‌ను సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అంజలి పాల్గొన్నారు.

బోగస్ ఓట్లు తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీమాంధ్ర మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి

లక్ష్మీపురం: గుంటూరు నగరం, జిల్లాకు సంబంధించిన ఓటర్ల జాబితాలలో చాలా పెద్ద సంఖ్యలో తప్పుల తడకలు ఉన్నాయని క్షేత్ర స్థాయిలో సక్రమంగా పరిశీలన చేస్తే 15 శాతం ఓట్లు తొలగించవచ్చు అని సీమాంధ్ర మేధవుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 22వ తేదీ ప్రకటించనున్న ఓటర్ల తుది జాబితా తప్పులు లేకుండా రూపొందించాలి అధికారులకు విన్నవించారు.

గత ఏడాది గాయాలను మర్చిపోలేం..

ప్రపంచ జనాభాను 800 కోట్ల మైలు రాయికి చేర్చి 2023 కాల గర్భంలో కలిసి పోయిందని, అయితే గత ఏడాది చేసిన గాయాలను ప్రపంచ ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరని ఆలిండియా ప్రొగ్రెసివ్ ఫోరం కార్యదర్శి ఎస్.హనుమంతరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో విశ్లేషకులు, సంస్థ సీనియర్ సభ్యులతో శుక్రవారం నిర్వహించిన చర్చ గోష్ఠి నిర్వహించారు. అనంతరం సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సంస్థ సభ్యులు తదితరులు ప్రసంగించారు.

సచివాలయ ఎంప్లాయీస్ క్యాలెండర్ ఆవిష్కరణ



నెహ్రూనగర్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సృష్టించిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ అత్యుత్తమ పనితీరుతో దేశానికే ఆదర్శనీయంగా నిలిచిందని ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ గుంటూరు జిల్లా కమిటీ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ అన్ని రకాల సేవలు ప్రతి గడపలోకి వచ్చి ప్రజలకు నేరుగా అందుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, మిర్చి యార్డు వైస్ చైర్మన్ షేక్ సుభాని, డైరెక్టర్లు కొత్తపేట సతీష్, ప్రభు, సంఘం రాష్ట్ర నాయకులు బత్తుల అంకమ్మరావు, బి.ఆర్.కిషోర్, గుంటూరు జిల్లా నాయకులు తాడిబోయిన రాజేష్, అనిల్ రాథోడ్, తోట మహేష్, గోలి ధనలక్ష్మి, జాన్ బెన్హర్, జాన్ డేనియల్, చల్లా శ్రీనివాస్, హరికృష్ణ, ఉదయ్, చాణిక్య, ప్రకాష్, బుల్లయ్య, శ్రీనివాస్, శిరీష, సుహాసిని పాల్గొన్నారు.

మలబార్ గోల్డ్‌లో మైన్ డైమండ్ షో ప్రారంభం



మైన్ డైమండ్ షోను ప్రారంభిస్తున్న డాక్టర్ హరిత, రమణారావు

పాత గుంటూరు: గుంటూరు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో శుక్రవారం మైన్ డైమండ్స్ షో ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా డాక్టర్ పి.ఎన్.ఎస్.హరిత, వ్యాపారవేత్త రమణారావు హాజరై మైన్ డైమండ్ షోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిత మాట్లాడుతూ షోరూంలో నాణ్యమైన బంగారు ఆభరణాలు, లైట్ వెయిట్ ఆభరణాలు, ప్లాటినం ఆభరణాలు వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈనెల 9 తేదీ వరకు జరిగే మైన్ డైమండ్స్ ప్రదర్శనను ప్రజలు సందర్శించాలని కోరారు. షోరూమ్ హెడ్ నదీర్ మాట్లాడుతూ పాత డైమండ్ ఆభరణాల మార్పిడిపై వంద శాతం విలువ, కొత్త డైమండ్ కొనుగోలు పై ఇరవై ఐదు శాతం తగ్గింపు లభిస్తుందన్నారు. నాణ్యమైన ఆభరణాలతో పాటు ఉచిత బీమా, మరిన్ని ఆఫర్లను అందిస్తున్నట్టు తెలిపారు. ధ్రువీకరించిన వజ్రాభరణాలను రూపొందించడంలో నమ్మకం, నాణ్యతకు మల్బార్ గోల్డ్ అండ్ డైమండ్స్ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ గోపి కిరణ్ పాల్గొన్నారు.

విలీన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు
- ప్రతి గ్రామం అభివృద్ధి జగనన్న లక్ష్యం



శంకుస్థాపన చేస్తున్న మేయర్ కావటి, పార్టీ ప్రత్తిపాడు సమన్వయకర్త కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: విలీన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. బుడంపాడులో క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బాలసాని కిరణ్ కుమార్‌తో కలిసి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. మేయర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ విలీన గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు.

గ్రామంలో తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించినట్లు తెలిపారు. రూ.50లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. సమన్వయకర్త బలసానికి కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులు, బీసీల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. వైఎస్ జగన్‌ను మరలా ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్థానిక కార్పొరేటర్ దాసరి లక్ష్మి, పార్టీ ఇన్‌చార్జి పెద్దింటి రామకోటి, పాస్టర్ నిరంజన్‌పాల్, కమ్యూనిటీ హాల్ కమ్యూనిటీ హాల్ సభ్యులు మోషే, సురేష్, ఆళ్ళ రవిదేవరాజు, ప్రభుదాస్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు వెస్ట్)
9912220356
Office mail : sakshigntadvt@gmail.com